క్లుప్తంగా

గర్భిణులకు ఎన్‌సీడీ పరీక్షలు



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం డాక్టర్ రిజ్వానా తాన్విర్ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆరోగ్య కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సిజేరియన్‌ను చేసుకోరాదని తెలిపారు. కార్యక్రమంలో చంద్రన్న, సత్యనారాయణ, హెలెన్, తిరుమల్‌రావు, వినోదిని, సోని పాల్గొన్నారు.

నీట్‌లో సత్తాచాటిన విద్యార్థినులు

గట్టు: నీట్ ఫలితాల్లో గట్టు విద్యార్థిని సాయిస్ఫూర్తి సత్తాను చాటుకుంది. మంగళవారం వెలువడిన నీట్ ఫలితాల్లో సాయిస్ఫూర్తి 720 గాను, 519 మార్కులను సంపాదించుకుని సత్తాను చాటుకుంది. ఆల్ ఇండియాలో 1,81,837 ర్యాంకును సాధించగా క్యాటగిరిలో 86,252 ర్యాంకును సొంత చేసుకుంది. గట్టుకు చెందిన శ్రీనివాస్, ఉమాదేవిల కుమార్తె సాయిస్ఫూర్తి మొదటి ప్రయత్నంలోనే నీట్‌లో ర్యాంకు సాధించడంపై పలువురు అభినందనలు తెలిపారు.



సాయిస్ఫూర్తి

శాంతినగర్: నీట్‌లో వెలువడిన ఫలితాల్లో శాంతినగర్‌కు చెందిన విద్యార్థిని సునంద ఉత్తీర్ణత సాధించి పలువురి మన్ననలు పొందింది. శాంతినగర్‌కు చెందిన టాక్సీ డ్రైవర్ చంద్రశేఖర్ కూతురు సునంద నీట్‌లో ఉత్తీర్ణత సాధించడంతో వడ్డేపల్లి మున్సిపాలిటీలో పలువురు విద్యావేత్తలు ఆమెను అభినందించారు.



సునంద

ప్యాచ్‌లు పోయి.. ప్రమాదాలు షురూ

శాంతినగర్: అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిపై నెల రోజుల క్రితం వేసిన ప్యాచ్‌లు పోవడంతో రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. బీటీతో ప్యాచ్ వర్క్ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకుండా తూతూ మంత్రంగా కంకర, సిమెంట్ కలిపిన మెటీరియల్‌తో గుంతలను పూడ్చివెళ్లారు. ఆ తరువాత నీరు పోయకుండా, మెటీరియల్ ఎత్తుగా వేయడంపై కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. దీంతో శాంతినగర్ నుంచి కలుకుంట్ల వరకు వేసిన కంకర అంతా పక్కకు తొలగిపోయి రహదారి గుంతలమయమై ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండటంతో వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో కంకర్రపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలుపడిన చోట పూర్తిస్థాయిలో ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు

- ఆరుగురికి గాయాలు



ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు ప్రయాణిస్తున్న కారు నిద్ర మత్తులో రోడ్డు పక్కన ఉన్న కర్బ్(ఇనుప డివైడర్)ను ఢీ కొట్టినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు వినయ్, దీపికా, మనోజ్, మమత, మున్నా, యశ్మిత హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు ప్రయాణిస్తున్నారు. ఇటిక్యాలపాడు స్టేజ్ సమీపంలోకి రాగానే జాతీయ రహదారిపై నిద్రమత్తులో రోడ్డు పక్కన ఉన్న కర్బ్‌ను కారు ఢీకొట్టింది. దీంతో కారులోని ఆరుగురుకి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

మద్యం పట్టివేత

గద్వాల క్రైం: గుట్టుగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని రూ. 7వేల విలువగల మద్యం స్వాధీనం చేసుకున్న ఘటన చోటుచేసుకుంది. పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన ప్రవీణ్‌గౌడు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు ఇంట్లో నిల్వ ఉన్న మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బోర్డు ఏర్పాటు

మరికల్: మండల కేంద్రంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న స్థలంలో ఆర్టీసీ సిబ్బంది మంగళవారం బోర్డు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం మరికల్‌లో బస్టాండ్ ఎదురుగా సర్వే నంబర్ 1లో ఉన్న ఎకరా స్థలాన్ని ఆర్టీసీ సంస్థకు అప్పగించింది. ఎట్టకేలకు స్పందించిన ఆర్టీసీ అధికారులు వారిపేరుతో బోర్డును ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు



ధరూరు వైఎస్సార్ చౌరస్తాలో బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధరూరు: నాగర్‌కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి గెలుపొందిన మల్లు రవి ఘన విజయంపై మండల కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని నెట్టింపాడు, ర్యాలంపాడు గ్రామాల్లో పెద్ద ఎత్తున బాణాసంచ కాల్చి సంబరాలు చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం వైఎస్సార్ చౌరస్తాలో సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దేవన్న, ఉప సర్పంచు సవారన్నల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, షాకీర్, బోయ మల్లి, వెంకటేష్, చాకలి మల్లి, ఉచ్చబుడ్డి సాయన్న, బీరప్ప, బడుగు నర్సన్న, నాగన్న, చాకలి రవి, మాజీ ఎంపీటీసీ దుబ్బన్న, చాపల రాములు పాల్గొన్నారు.

మల్లు రవిని కలిసిన నాయకులు..

ఎంపీగా విజయం సాధించిన మల్లు రవిని మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మల్లు రవిని కలిసిన వారిలో మండల జడ్పీటీసీ పద్మావెంకటేశ్వర్‌రెడ్డి, బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్, నరేందర్ రెడ్డి, రామిరెడ్డి, తిమ్మారెడ్డి, కురువ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. నాగర్‌కర్నూలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి విజయం సాధించడం పట్ల గట్టు బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు బాణాసంచ కాల్చుతూ సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహబూబ్‌పాష, నాయకులు రమేష్, నర్సింహులు, గోవిందు, సంతోష్, తుమ్మలబాయి నర్సింహులు, నాగరాజు, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, శేరుపల్లె, భైరాపురం గ్రామాల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవి ఎంపీగా విజయం సాధించడంతో కార్యకర్తలు సంబరాలు చేశారు. మండల కేంద్రంలో మండల నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు చేశారు.

అయిజ: పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ స్థానం నుంచి మల్లు రవి విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాణా సంచ కాల్చి, మిఠాయులు పంచుకున్నారు.



అయిజలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



మానవపాడులో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు విజయత్సోవ సంబరాలు నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో మల్లు రవి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించడంతో బాణా సంచా కాల్చి సంబురాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ సిరాజ్, పరమేష్ నాయుడు, బ్రహ్మేశ్వర్, పరమేష్, శాంతన్న, గణేష్ పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి విజయం సాధించడంతో పాటు, రాష్ట్రంలో మొత్తం 8 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవడంతో ఆయా గ్రామాల్లోని కూడళ్లలో సంబరాలు చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు.



నెట్టెంపాడులో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



గట్టులో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఉండవెల్లిలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసిన నాయకులు

గాలివాన బీభత్సం..



ధరూరులో కురుస్తున్న వర్షం

ఉరుములతో కూడిన భారీ వర్షం

ధరూరు: మండలంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం గంట పాటు భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. భారీ గాలులకు చెట్లు నేలకొరిగాయి. డ్యాం రూట్లో చెట్లు విరిగి రోడ్డుకు పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తరువాత చెట్లు తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి. పారుచర్ల సమీపంలో నేడో రేపో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మినీ రైస్‌మిల్ భారీ గాలులకు పైకప్పు లేచిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.



భారీ గాలులకు నూతన రైస్‌మిల్ పైకప్పు

జోరుగా విత్తనాల సాగు

శాంతినగర్: సోమవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షంతో పొలాల్లో నీరు నిలిచి పూర్తిస్థాయిలో పొలాలు తడవడంతో అన్నదాతలు విత్తనాలు విత్తే పనిలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఆయా గ్రామాల్లోని పొలాల్లో రైతులు పత్తి, ఆముదాలు, వేరుశనగ విత్తనాలు విత్తే పనిలో బిజీ అయ్యారు. కూలీలు, ఎద్దుల గెడాలతో పొలాల్లో సందడి నెలకొంది.

ఇద్దరికి గాయాలు

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లోని శ్రీనగర్ కాలనీలో బైక్ అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కర్నూల్ నుంచి తండ్రీకొడుకులు చంద్రశేఖర్, తిరుమలేష్‌లు రాయల్‌ఇన్‌ఫీల్డ్ బైక్‌పై శాంతినగర్ గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శాంతినగర్ నుంచి కర్నూల్ వైపు వెళ్తుండగా, కలుకుంట్ల – శ్రీనగర్ కాలనీ మధ్యలో బైక్ అదుపు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వారిని 108లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తపాలా శాఖలో గ్రేడ్-1 పోస్టుమాస్టర్ల బదిలీలు

ఖమ్మంగాంధీ చౌక్: రాష్ట్రంలోని ఐదు హెడ్ పోస్టాఫీసుల్లో పనిచేసే హయ్యర్ సెలక్షన్ గ్రేడ్–1(హెచ్‌ఎస్‌జీ–1) పోస్టుమాస్టర్లను బదిలీ చేస్తూ హైదరాబాద్ ప్రాంతీయ పోస్టు మాస్టర్ జనరల్ సుమిత అయోధ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ హెచ్‌ఎస్‌జీ గ్రేడ్–1 పోస్టుమాస్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డిని వరంగల్ హెడ్ పోస్టాఫీసుకు బదిలీ చేశారు. అలాగే, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ కె.సుబ్రమణ్యంను ఖమ్మంకు, హన్మకొండ హెడ్ పోస్టాఫీస్‌లో డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ ఎం.సురేష్‌బాబును మహబూబ్‌నగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం(ఎస్‌బీ) పోస్టుమాస్టర్ కేవీ.పవన్‌కుమార్‌ను హన్మకొండ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా, వరంగల్ హెడ్ పోస్టాఫీస్ డీపీఎం (మెయిల్స్) పోస్టుమాస్టర్ ఏ.తిరుపతిని కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా మరో ఇద్దరు పోస్టుమాస్టర్లకు హయ్యర్ సెలక్షన్ గ్రేడ్–1 పోస్టుమాస్టర్లుగా(హెచ్‌ఎస్‌జీ–1) పదోన్నతి కల్పించడమే కాక బదిలీ చేశారు. నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టుమాస్టర్లు(హెచ్‌ఎస్‌జీ–2)గా పనిచేస్తున్న జి.గంగాధర్‌కు హెచ్‌ఎస్‌జీ–1గా ఉద్యోగోన్నతి కల్పించి ఆదిలాబాద్ హెడ్ పోస్టాఫీస్‌కు, కె.అజయ్ కుమార్‌ను నిజామాబాద్ హెడ్ పోస్టాఫీస్‌లోనే హెచ్‌ఎస్‌జీ–1గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆశా కార్యకర్తలకు పదోన్నతులు కల్పించాలి

మదనాపురం: ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం ఏఎస్‌ఎం, జీఎస్‌ఎంగా పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డి మాండ్ చేశారు. ఆశాలకు పరీక్ష పెట్టడం సరైంది కాదని, నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరుతూ డాక్టర్ భవానీకి వినతిపత్రం సమర్పించారు.

నీట్‌లో 'రిషి' విద్యార్థుల సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న రిషి యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిషి అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈ మేరకు అకాడమీకి చెందిన అనన్య 627 మార్కులు, మౌనిక 621, సఫాన్ సాద్ 610, సంతోష్ 600 మార్కులు సాధించినట్లు అకాడమీ కరస్పాండెంట్ చంద్రకళావెంకట్ పేర్కొన్నారు. 600లకు పైగా ఐదుగురు, 550 మార్కులు 20 మంది, 500లకు పైగా 50 మంది మార్కులు సాధించినట్లు తెలియజేశారు. తమ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని, ఎక్కువ సంఖ్యలో మెడికల్ సీట్లు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో సలహాదారు వెంకటయ్య, డీన్ భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వాగ్దేవీ' విజయకేతనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజామన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ కళాశాల విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మా విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పోటీ పడేలా తీర్చిద్దామని, ఇన్నొవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక బోధన చేశామన్నారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి తల్లిదండ్రులు, జిల్లా పేరును నిలబెట్టారన్నారు. ఈ మేరకు కళాశాలకు చెందిన 30 నుంచి 45 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జ్ పావని, యాకుబ్, షాకీర్, శివకుమార్, రాఘవేందర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

అయిజ: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాలతోపాటు మండలంలోని మేడికొండ, పులికల్, రాజాపురం, బైనిపల్లి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ కళాశాల గురించి ప్రచారం చేశారు. ఇంటర్ చదివే విద్యార్థులను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరారు. 2024లో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థులు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు. అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన ఉంటుందని, కళాశాలలో అన్ని మౌలిక వసతులున్నాయని, ల్యాబ్ సౌకర్యాలు, ఉచిత పాఠ్య పుస్తకాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రాజేందర్, బాలస్వామి, శ్రీరాములు, చలపతిరెడ్డి, జహంగీర్ పాల్గొన్నారు.



ఇటింటి ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

బీజేపీ గెలుపుతో నాయకుల ఉత్సాహం



కేటీదొడ్డిలో బాణాసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు



జూలెకల్‌లో బాణా సంచా కాలుస్తున్న బీజేపీ కార్యకర్తలు

కేటీదొడ్డి: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఎన్నికల్లో విజయం సాధించిన సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గద్వాల కర్రెన్న, వీరన్న, సాయన్న, వీరన్న, వెంకటేష్, ఉరుకుందు ఉన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ గ్రామంలో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. దేశంలో మూడోసారి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని ఆ పార్టీ నాయకులు, యువకులు సంబురాల్లో మునిగి తేలారు. బాణా సంచా కాల్చుతూ, మిఠాయిలు పంచారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని ఆయా గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎంపీగా నడిగడ్డ ప్రాంతానికి చెందిన డీకే అరుణ విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు.

పెద్దమ్మ బోనాల పండుగ

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మంగళవారం పెద్దమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు కొత్త కుండలతో అమ్మవారి బోనం తయారు చేసుకొని ఆలయానికి చేరుకున్నారు. ఆయా వీధుల నుంచి భాజాబజంత్రిలతో ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాత నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



బోనాలతో బయలుదేరిన మహిళలు

ఎంపీ మల్లు రవికి నాయకుల సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీగా గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి నాగర్‌కర్నూల్‌లో మల్లు రవిని కలిసి మర్యాద పూర్వకంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉన్నారు.



ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు



కౌంటింగ్ హాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అబ్జర్వర్లు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని నెల్లికొండి వ్యవసాయ మార్కెట్‌యార్డు గోదాంలో మంగళవారం నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతవారణంలో ముగిసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అసౌర్యాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 నుంచి ప్రారంభమైన కౌంటింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉండగా.. నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, వనపర్తి, కల్వకుర్తి, అలంపూర్, గద్వాల అసెంబ్లీ సెగ్మెంట్లకు సబంధించిన ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా కొనసాగింది. కౌంటింగ్ అబ్జర్వర్లు సత్పాల్ శర్మ, రుచేష్ జైవాన్షీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, అభ్యర్థుల సమక్షంలో ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్‌రూం తెరిచి, ఈవీఎంలను టేబుళ్లపైకి పంపించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించి ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించి.. తర్వాత ఈవీఎంల ఓట్లను లెక్కించారు. ఎంపీగా విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి.. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కలెక్టర్ ఉదయ్‌కుమార్ చేతులమీదుగా ధ్రువపత్రం అందుకున్నారు.

పటిష్ట భద్రత..

కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. మీడియా, అనుమతి ఉన్న వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించారు. ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించలేదు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. కౌంటింగ్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, విలేకరులకు భోజన వసతి కల్పించారు. భోజన సమయంలో కౌంటింగ్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఇన్‌చార్జి అధికారులు చర్యలు చేపట్టారు.

నిరంతర పర్యవేక్షణ..

కౌంటింగ్ ప్రక్రియను కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్, ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రౌండ్ల వారీగా ఫలితాలను పరిశీలించడంతో పాటు ఎక్కడా ఎలాంటి సమస్యలు తల్తెకుండా చర్యలు చేపట్టారు. రిటర్నింగ్ అధికారుల అనుమతితో ఎన్నికల ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు మల్లురవి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పోతుగంటి భరత్‌ప్రసాద్ కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు.



ఈవీఎంల ఓట్లను లెక్కిస్తున్న సిబ్బంది